RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 64 Vol: 64 | మార్చి 23 సోమవారం 2026 March 23 Monday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

తెలంగాణలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరత లేదు..

2

# వరిపైనే ఆధారపడొద్దు

- ఫాం ఆయిల్ సాగుకు ముందుకు రండి..
- సీఎం రేవంత్ రెడ్డి
- రైతు భరోసా' నిధులు విడుదల



**సిద్దిపేట/నర్మెట్ట జన సంఘర్షణ**
రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయం అందించే 'రైతు భరోసా' నిధులను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి విడుదల చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి రిమోట్ బటన్ నొక్కి ఈ ప్రక్రియను ప్రారంభించారు. రేపటి నుంచే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని సీఎం స్పష్టం చేశారు. రాబోయే 45 రోజుల్లో మొత్తం రూ. 9 వేల కోట్ల రూపాయలను అర్హులైన రైతులందరి ఖాతాల్లోకి పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కేవలం 17 నెలల రికార్డు కాలంలో పూర్తి చేసిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని సీఎం ప్రారంభించి రైతులకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో రూ. 775 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొడంగల్‌లో కూడా ఇలాంటి ఫ్యాక్టరీని నిర్మించాలని మంత్రులను ఆదేశించారు. రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా లాభసాటి పంటల వైపు మళ్లాలని, అంకాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. యూరియా కొరతపై హెచ్చరిక: పశ్చిమాసియా యుద్ధం వల్ల గ్యాస్, యూరియా కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని, రామగుండం యూరియాను మన రాష్ట్రానికే కేటాయించేలా కేంద్రాన్ని కోరతామన్నారు. రైతులు 'నానో యూరియా' వినియోగం పెంచుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు: ప్రస్తుతం 3 లక్షల ఎకరాల్లో ఉన్న ఆయిల్ పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు పెంచినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ

➢ మిగతా 2వ పేజిలో..

## సీఎం రేవంత్ రెడ్డికి రైతన్నల ఆశీర్వాదం ఉండాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**సిద్ధిపేట జన సంఘర్షణ**
ఈ రాష్ట్ర రైతాంగం శ్రేయస్సు కోసం అహర్నిశలు కష్టపడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి రైతన్నల ఆశీర్వాదం ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు. సాక్షాత్తూ రైతు బిడ్డ అయిన రేవంత్.. రైతును రాజుగా చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని కొనియాడారు. సిద్దిపేట జిల్లాలో నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడారు. గ్రామంలో పుట్టి గ్రామంలో చదివి ఈనాడు అసాధ్యమైన అంశాలను సుసాధ్యం చేస్తూ రాష్ట్రానికి రెండో సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం

➢ మిగతా 2వ పేజిలో..

# ప్రపంచంలో సురక్షితమైన నగరాలివే

## గల్ఫ్ దేశాల హవా.. భారత్ నుంచి మంగళూరుకే ఛాన్స్



**బీజింగ్ జన సంఘర్షణ**
మనం నివసించే ప్రాంతం ఎంత సురక్షితమైనది? అర్ధరాత్రి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లినా ఎలాంటి భయం లేని నగరాలు ఎక్కడున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానంగా ప్రఖ్యాత గ్లోబల్ డేటాబేస్ సంస్థ 'నంబియో' (చీబఎవశీ) 2026 సంవత్సరానికి గాను సేఫ్టీ ఇండెక్స్‌ను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా నేరాల రేటును, ప్రజల వ్యక్తిగత భద్రతను అంచనా వేస్తూ ఈ టాప్-50 నగరాల జాబితాను ప్రకటించింది. ఇందులో చైనాకు చెందిన 'క్వింగ్‌డావో' నగరం అగ్రస్థానంలో నిలవగా, భారతదేశం నుంచి ఒకే ఒక్క నగరానికి ఈ ప్రతిష్టాత్మక జాబితాలో చోటు దక్కింది.

ఈ జాబితాలో గల్ఫ్ దేశాలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. టాప్-5లో యూఏఈకే చెందిన అబుదాబి (2), షార్జా (4), దుబాయ్ (5) నగరాలు నిలిచాయి. ఇక మూడవ స్థానంలో ఖతార్ రాజధాని దోహా నిలిచింది. ఇరాన్‌తో సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఇవి యుద్ధ సంబంధిత దాడులు కాబట్టి, నంబియో

➢ మిగతా 2వ పేజిలో..

# ఏనీటైం గ్యాస్

## గురుగ్రామ్‌లో ప్రారంభం

**గురుగ్రాం జన సంఘర్షణ**
పశ్చిమాసియా యుద్ధం వంటిలపై మంట పెడుతోంది. భారత్‌పై ప్రభావం చూపుతోంది. భారత్ దాదాపు 60శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంతో సరఫరాలో అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడడం సమస్యగా మారింది. సిలిండర్ల కోసం బుకింగ్ చేసుకుని ఇంటికెప్పుడొస్తుందా అని ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వినూత్న 'స్మార్ట్ ఎల్‌పీజీ వెండింగ్ మెషిన్'ను అందుబాటులోకి తెచ్చింది. మొదటి ఎల్‌పీజీ ఏటీఎం ను భారత్ గురుగ్రామ్‌లో ప్రారంభించింది. గురుగ్రామ్‌లోని సోహ్నా, సెక్టార్ 33లోని సెంట్రల్ పార్క్ ఫ్లవర్ వ్యాలీలో బీపీసీఎల్ ఈ పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. సిలిండర్ ను ఇలా పొందొచ్చు.. 'భారత్ గ్యాస్ ఇన్‌స్టా ఎల్‌పీజీ' పేరుతో దీన్ని పిలుస్తారు.




సాధారణ నగదు ఏటీఎం

➢ మిగతా 2వ పేజిలో..

# దేశానికి పెరగనున్న ఎల్పీజీ లభ్యత

## మంగళూరు పోర్టుకు చేరిన భారీ నౌక 'పిక్సిస్ పయనీర్'

**మంగళూరు జన సంఘర్షణ :**
దేశంలో వంటగ్యాస్ అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం దిగుమతులను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు భారీ ఎత్తున ఎల్పీజీ నిల్వలు వచ్చి చేరుతున్నాయి. తాజాగా 'పిక్సిస్ పయనీర్' అనే భారీ నౌక 16,714 టన్నుల ఎల్పీజీతో మంగళూరు తీరానికి చేరుకుంది. రానున్న రోజుల్లో దేశీయ మార్కెట్లో గ్యాస్ కొరత లేకుండా చూసేందుకు మరిన్ని నౌకలు భారత్ వైపు వస్తున్నాయి. వచ్చే వారం ఒక్క మంగళూరు పోర్టు ద్వారానే మొత్తం 72,700 టన్నుల ఎల్పీజీ దిగుమతి కానుంది. మార్చి 25: 'అపోలో ఓషన్' నౌక 26,687 టన్నుల ఎల్పీజీతో రానుంది. మార్చి 29: మరో భారీ నౌక సుమారు 30,000 టన్నుల గ్యాస్ నిల్వలతో



➢ మిగతా 2వ పేజిలో..

# రాజీనామా చేస్తా..

- నాకు జరిగిన అన్యాయంలో రేవంత్ రెడ్డికి భాగం
- 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నా..
- అవమానాలను భరిస్తూ పార్టీలో కొనసాగలేను..
- ప్రజలకు లాభం చేసే పార్టీ వెంటే నా ప్రయాణం

**జగిత్యాల జన సంఘర్షణ**
ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. అదే రోజు కార్యకర్తలతో సమావేశమై తదుపరి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని ఆయన వెల్లడించారు. ఆదివారం జగిత్యాలలో జీవన్ రెడ్డి మీడియాతో

➢ మిగతా 2వ పేజిలో..

# వరిపైనే ఆధారపడొద్దు

**మొదటిపేజీ తరువాయి..** ఇచ్చారు. రికార్డు స్థాయిలో ఖర్చు: గత ప్రభుత్వం నెలకు సగటున రూ. 2,533 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం నెలకు రూ. 5,500 కోట్లు రైతు సంక్షేమం కోసం వెచ్చిస్తోందని సీఎం వివరించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

# ఏనీటైం గ్యాస్

**మొదటిపేజీ తరువాయి..** తరహాలోనే 24 గంటల పాటు సేవలందిస్తుంది. ముందుగా మెషిన్ స్క్రీన్‌పై రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను నమోదు చేయాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత గుర్తింపును ధ్రువీకరించుకోవాలి. అనంతరం మీ ఖాళీ సిలిండర్‌పై ఉన్న క్యూఆర్ (ు=) కోడ్ లేదా బార్‌కోడ్‌ను మెషిన్ స్కానర్ ముందు ఉంచాలి. అది చెల్లుబాటు అవుతుందో లేదో మెషిన్ తనిఖీ చేస్తుంది.

విండో తెరుచుకున్నాక అందులో ఖాళీ సిలిండర్‌ను పెట్టాలి. మెషిన్ దాని స్వచ్ఛతను, బరువును తనిఖీ చేసుకొని లోపలికి తీసుకుంటుంది. స్క్రీన్‌పై కనిపించే గ్యాస్ ధరను ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం పక్కనే ఉన్న డెలివరీ విండో నుంచి సీల్ చేసిన నిండు సిలిండర్ బయటకు వస్తుంది.

ఇవీ ఏటీఎం ప్రత్యేకతలు..

- లైట్ వెయిట్ సిలిండర్లు: ఈ మెషిన్ ద్వారా 10 కిలోల కాంపోజిట్ సిలిండర్లను అందిస్తున్నారు. ఇవి పాత ఇనుప సిలిండర్ల కంటే తేలికగా ఉంటాయి.
- స్మార్ట్ అలర్ట్ సిస్టమ్: మెషిన్‌లో ఒకేసారి 10 సిలిండర్లను లోడ్ చేయవచ్చు. స్టాక్ తగ్గిపోయి కేవలం రెండు సిలిండర్లే ఉన్నప్పుడు మెషిన్ సమీప గ్యాస్ ఏజెన్సీకి రీఫిల్ కోసం అలర్ట్ పంపిస్తుంది.

త్వరలో దేశవ్యాప్తంగా..

గ్యాస్ సిలిండర్ల డెలివరీలో పారదర్శకత పెంచడానికి, సమయాన్ని ఆదా చేయడానికి ఈ 'ఏనీ టైమ్ గ్యాస్' విధానం వినియోగదారులకు ఎంతగానో దోహదపడనుంది. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం లేకపోలేదు.

# దేశానికి పెరగనున్న ఎల్పీజీ లభ్యత

**మొదటిపేజీ తరువాయి..** పోర్టుకు చేరుకోనుంది. వినియోగదారులకు ఊరట అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, నిరంతరాయంగా దిగుమతులు కొనసాగడం వల్ల దేశీయంగా సరఫరా వ్యవస్థ సాఫీగా సాగే అవకాశం ఉంది. ముఖ్యంగా పారిశ్రామిక, గృహ అవసరాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ భారీ దిగుమతులు కీలకం కానున్నాయి. పోర్టుకు చేరిన గ్యాస్‌ను వెంటనే బాట్లింగ్ ప్లాంట్లకు తరలించి, అక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు సరఫరా చేయనున్నారు.

# ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత

**ప్రకటించుకున్న ఇరాన్**

**టెహ్రాన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే ఆమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది.

ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గ్గ్÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది.

## సీఎం రేవంత్ రెడ్డికి రైతన్నల
# ఆశీర్వాదం ఉండాలి

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. రైతుకు ప్రాధాన్యత ఇచ్చారు. రైతాంగ శ్రేయస్సు నా ధ్యేయం. ప్రజా పాలనలో ప్రాముఖ్యత కలిగిన అంశం వ్యవసాయం. అన్నం పెట్టే రైతాంగానికి ఎన్ని కష్టాలు వచ్చినా మనం వాళ్లకు అండగా ఉండాల్సిందేనని చెప్పి రైతు బిడ్డగా రేవంత్ ప్రతి హామీని నెరవేర్చుతున్నారు. 2 లక్షల లోపు రుణమాఫీ కింద మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల అప్పులు తీర్చారు మన పెద్ద రైతు. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనటువంటి దుస్సాహం ఇది. రాష్ట్రం అప్పుల్లో ఉన్న కూడా మాటిచ్చానని చెప్పి.. ఒకేసారి రుణమాఫీ చేశారు. రైతులను రుణ విముక్తులను చేశారు. పల్లెల గురించి, రైతుల గురించి, నేతన్నల గురించి మాట్లాడే సీఎం మనకు దక్కడం అదృష్టం. రైతాంగం సంతోషంగా ఉంటే రాష్ట్రం సంతోషంగా ఉంటుంది. మొదటి రెండేండ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. లక్షా 4 వేల కోట్లు బదలాయించారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.

ఒకేసారి రూ. 21 వేల కోట్లు రుణమాఫీ

మన్మోహన్ సింగ్ ఉన్నప్పుడు దేశానికి మొత్తం రూ. 70 వేల కోట్ల రుణమాఫీ చేస్తే. మన సీఎం ఒకేసారి రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేశారు. అయితే ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోం. అబద్దాలను అవాస్తవమైన ప్రకటనలను పట్టించుకోం. రైతు కళ్లల్లో ఆనందం చూసే దాకా వెనుకగడు వేయడు అని మనవి చేస్తున్నాం. రైతులను ఆదుకోవాలని చెప్పి రైతు భరోసా కింద రూ. 9 వేల కోట్లను 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమం చేశాం. పంటలకు బోనస్ ఇస్తున్నాం. చిరు ధాన్యాలకు, పప్పు ధాన్యాలకు బోనస్ ఇచ్చి రైతును ఆదుకోవాలన్నది సీఎం కోరిక. అత్యధికం పంటలు పండించిన రాష్ట్రంగా ఉంది. తెలంగాణ నడిగడ్డన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ స్థాపించడానికి కారణం అన్ని జిల్లాలకు దగ్గరగా ఉంటుందని. రిఫైనరీలు లేవు. ఇతర రాష్ట్రాలకు పంపి మళ్లీ మనం తీసుకొచ్చి విజయ బ్రాండ్‌తో అమ్ముకుంటున్నాం. సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో 50 కోట్లతో ఇక్కడే రిఫైనరీలకు శంకుస్థాపన చేశారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రతిపక్షాలు గోతికాడ నక్కలాగా చూస్తున్నారు.. ఈ ముఖ్యమంత్రి రుణమాఫీ చేయలేదు. యూరియా ఇవ్వలేదు. భరోసా ఇవ్వలేదు. పంటలు కొనలేదు అని చెప్పి ప్రతిపక్షాలు గోతికాడ నక్కలాగా చూస్తున్నారు. మీకు అవకాశం రాదని గుంట నక్కలకు చెబుతున్నాం. కనీస మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తాం. యూరియా కోసం పది సార్లు కేంద్రాన్ని కలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి. 10 లక్షల మెట్రిక్ ట్నులకు బదులుగా 11.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తీసుకొచ్చారు. యూరియా కోసం కొంతమంది క్యూలో నిలబడితే వారి చెప్పులను చూసి సంతోషపడ్డాయి ప్రతిపక్ష పార్టీలు. పోయిన సారి 10 లక్షలు, యాసంగిలో 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తీసుకొచ్చామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మీ జేబుల్లో కోటాది రూపాయాలు జమ చేసే రేవంత్‌ను ఆశీర్వదించాలి.. ఆర్ఎఫ్‌సీ యూరియాను తెలంగాణకు ఇవ్వాలని కోరాం. తెలంగాణ పచ్చబడాలంటే పామాయిల్ పంటలు వేయాలి. రైతు అగ్రగామిగా నిలబడాలి. మీ జేబుల్లో కోటాది రూపాయాలు జమ చేసే రేవంత్‌ను ఆశీర్వదించాలి. తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా నిలపాలి. అత్యధికంగా పామాయిల్ పంటను సాగను చేస్తున్నాం. ప్రస్తుతం మూడు లక్షల ఎకరాల్లో పామాయిల్ పంటను సాగు చేస్తున్నాం. మూడేండ్లలో ఆరు లక్షల ఎకరాల్లో సాగు చేస్తామని విజ్ఞప్తి చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు.

# రాజీనామా చేస్తా..

**మొదటిపేజీ తరువాయి..** మాట్లాడారు. నాకు జరిగిన అన్యాయంలో సీఎం రేవంత్ రెడ్డికి భాగం ఉంది. పార్టీ ఫిరాయింపుల వల్ల రాహుల్ గాంధీ ఆశయాలకు విఘాతం కలుగుతుంది. రాహుల్ కంటే రేవంత్ రెడ్డి పార్టీకి ఎక్కువయ్యాడు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నాను. అవమానాలకు గురవుతూ పార్టీలో కొనసాగలేని పరిస్థితి. అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాను. నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి. ఏది ఏమైనా ప్రజల్లోనే ఉంటాను. ప్రజలకు ఎక్కువగా ఏ పార్టీ లాభం చేస్తుందనుకుంటుందో దాని వెంటే నా ప్రయాణం సాగుతుంది అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఎల్పీజీ సిలిండర్ల కొరత లేదు..

**హైదరాబాద్**

తెలంగాణలో ఎల్పీజీ సిలిండర్ల కొరత లేదని పౌర సరఫరాల సంస్థ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో మంగళవారం ఒకే రోజు 2,35,678 సిలిండర్లను డెలివరీ చేసినట్లు తెలిపింది. గ్యాస్ సిలిండర్ రీ ఫిల్లింగ్ కోసం ఆందోళన చెందొద్దని వినియోగదారులకు ప్రభుత్వం సూచించింది. సిలిండర్ల డెలివరిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లో అధికారులతో పాటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, కంపెనీల ప్రతినిధులు ఉన్నారని తెలిపింది. ఈ మూడు కంపెనీలు కలిపి సగటున రోజుకు 2,15,151 సిలిండర్లు డెలివరీ చేసేవని, నిన్న అంతకు మించి డోర్ డెలివరీ చేసిందని వివరించారు. ఇండియన్ ఆయిల్ 93,887, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ 84,156, బీపీసీఎల్ 57,635 డెలివరీ చేశాయని పౌర సరఫరాలశాఖ పేర్కొంది.

## సురక్షితమైన నగరాలివే..

**మొదటిపేజీ తరువాయి..** ఇండెక్స్ వాటిని పరిగణనలోకి తీసుకోదు. కేవలం రోజువారీ నేరాలు, స్థానిక భద్రతపైనే ఇది దృష్టి పెడుతుంది. కాగా, ఈ టాప్-50 జాబితాలో భారత్ నుంచి మంగళూరు (మ్ఖిఅస్త్రుశ్రీబతీబ) 46వ స్థానంలో నిలిచి దేశంలోనే అత్యంత సురక్షిత నగరంగా నిలిచింది.

ఈ ర్యాంకింగ్స్ ఎలా ఇస్తారు? (పరిగణనలోకి తీసుకునే అంశాలు)

ప్రజల అభిప్రాయాలు (యూజర్ సర్వేలు) ఆధారంగా నంబియో ఈ ర్యాంకింగ్స్ ఇస్తుంది. ఇందులో ప్రధానంగా నేరాల తీవ్రత (ాజవతీఖశ్రీశ్రీ ఎతీఅఎవ శ్రీవజవశ్రీ), పగలు, రాత్రి వేళల్లో ఒంటరిగా నడవడంలో భద్రత, దొంగతనాలు, కార్ల చోరీల భయం, భౌతిక దాడులు, వేధింపులు, అవమానాలకు గురయ్యే ప్రమాదం, డ్రగ్స్ సంబంధిత సమస్యలు, ఆస్తి, హింసాత్మక నేరాలు (దోపిడీలు, హత్యలు వగైరా), మతం, జాతి, లింగ వివక్షల భయం లాంటివి పరిగణనలోకి తీసుకొని ఈ నివేదికను రూపొందించారు.

ర్యాంకు - నగరం - దేశం
1 - క్వింగ్‌డావో - చైనా
2 - అబుదాబి - యూఏఈ
3 - దోహా - ఖతార్
4 - షార్జా - యూఏఈ
5 - దుబాయ్ - యూఏఈ
6 - తైపీ - తైవాన్
7 - మనామా - బహ్రెయిన్
8 - మస్కట్ - ఒమన్
9 - ది హేగ్ - నెదర్లాండ్స్
10 - ఐండ్‌హోవెన్ - నెదర్లాండ్స్
11 - ఉట్రెచ్ట్ - నెదర్లాండ్స్
12 - మ్యూనిచ్ - జర్మనీ
13 - ట్రోండ్‌హీమ్ - నార్వే
14 - జాగ్రెబ్ - క్రొయేషియా
15 - హాంకాంగ్ - హాంకాంగ్
16 - గ్రోనింగెన్ - నెదర్లాండ్స్
17 - టాలిన్ - ఎస్టోనియా
18 - లుబ్లజానా - స్లోవేనియా
19 - చియాంగ్ మాయ్ - థాయ్‌లాండ్
20 - యెరెవాన్ - అర్మేనియా
21 - క్యూబెక్ సిటీ - కెనడా
22 - క్లూజ్-నపోకా - రొమేనియా
23 - సింగపూర్ - సింగపూర్
24 - జ్యూరిచ్ - స్విట్జర్లాండ్
25 - రిజేకా - క్రొయేషియా
26 - జెంట్ - బెల్జియం
27 - బెర్గెన్ - నార్వే
28 - రేక్‌జావిక్ - ఐస్‌లాండ్
29 - ప్లైన్ - చెక్ రిపబ్లిక్
30 - బ్ర్నో - చెక్ రిపబ్లిక్
31 - రియాద్ - సౌదీ అరేబియా
32 - సియోల్ - దక్షిణ కొరియా
33 - ప్రేగ్ - చెక్ రిపబ్లిక్
34 - క్రాకోవ్ - పోలాండ్
35 - షెన్‌జెన్ - చైనా
36 - జెడ్డా - సౌదీ అరేబియా
37 - స్టవాంజర్ - నార్వే
38 - టోక్యో - జపాన్
39 - బీజింగ్ - చైనా
40 - వ్రోక్లా - పోలాండ్
41 - హెల్సింకి - ఫిన్‌లాండ్
42 - టిమిసోరా - రొమేనియా
43 - వార్సా - పోలాండ్
44 - టిబిలిసి - జార్జియా
45 - ప్లోవ్‌డివ్ - బల్గేరియా
46 - మంగళూరు - భారత్
47 - ఆమ్‌స్టర్‌డామ్ - నెదర్లాండ్స్
48 - కోపెన్‌హాగన్ - డెన్మార్క్
49 - బెర్న్ - స్విట్జర్లాండ్
50 - టెల్ అవీవ్-యాఫో - ఇజ్రాయెల్

# ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

**న్యూఢిల్లీ,** ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి

## ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం, మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ 2026, బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందచేసిన రాజ్య సభ ఎంపీ డా. కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 22( జనసంఘర్షణ )

ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్‌లోని ఘంటసాల శ్రీనివాస గ్రౌండ్స్‌లో ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం, మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ 2026, బ్యాడ్మింటన్ పోటీలు, అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి డా కె.లక్ష్మణ్, బ్యాడ్మింటన్ విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, బహుమతులను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో క్రీడాకారుల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని అందుకు నిదర్శనం బడ్జెట్ లో క్రీడారంగానికి ప్రత్యేకంగా పెద్దఎత్తున నిధులు కేటాయించడమే అని అన్నారు. దేశ వ్యాప్తంగా పల్లెల్లో, పట్టణాల్లో చేయూత అందని క్రీడాకారులను ప్రోత్సాహించేందుకే ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్ గౌడ్, ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రామ్, సీనియర్ నాయకులు కోవా రాహుల్, బిజెపి గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సురేష్ రాజు, ఆనంద్ రావు, సాయి కుమార్, నీరజ్, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, శేషీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ శనగ, సన్ ప్లావర్ కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవం

పోతంగల్/మార్చ్ 22/(జన సంఘర్షణ)




విశాల సహకార పరపతి సంఘం పోతంగల్, సంఘ పరిధి గ్రామ పెద్దలకు, శనగ, సన్ ప్లావర్ రైతులకు అందరికి తెలియ చేయునది ఏమనగా సోమవారం ఉదయం, 11:30 గంటలకు సంఘ రైస్ మిల్ ఆవరణలో 2025.26 రబీ సీజన్ టీజీ మార్క్ ఫెడ్/ఎన్ సి సి ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శనగ, సన్ ప్లావర్ కొనుగోలు కేంద్రం సంఘ పీఐసీ /చైర్మన్ ఎండీ రియాజుద్దీన్ లతో ప్రారంభించబడునని ఇంచార్జి కార్యదర్శి తెలిపారు. కావున తాము ఈ కార్యక్రమమునకు సకాలంలో హాజరై జయప్రదం చేయగలరని మనవి. ప్రభుత్వ శనగ మద్దతు ధర రూ. 5875, సన్ ప్లావర్ మద్దతు ధర రూపాయలు 7721 లుగా ఉంది.

# ఇళ్ళు లేని పేదలకు ఇళ్ళు అడిగితే అరెస్టులా?

**❑ కొమరారంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ )

ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల ప్రాంతంలో పేదల ఇళ్ల కూల్చివేత, న్యూడెమోక్రసీ నాయకుల అరెస్టులపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇల్లందు మండలం కొమరారం గ్రామంలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి న్యూడెమోక్రసీ మండల నాయకుడు కామ్రేడ్ జోగా కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ ఇల్లందు మండల సహాయ కార్యదర్శి మోతిలాల్, గ్రామ కార్యదర్శి మూడు మాలు మాట్లాడుతూ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. వెలుగుమట్ల ప్రాంతంలో పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చివేయడం, బుదాన్ భూములను అక్రమంగా ఆక్రమించడం అన్యాయమని ఆరోపించారు. గత 15 సంవత్సరాలుగా నివసిస్తున్న పేదలపై ఇలాంటి చర్యలు తీసుకోవడం దౌర్జన్యమని పేర్కొన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కమిటీ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు శాంతియుతంగా బంద్‌కు సహకరిస్తున్నప్పటికీ, ప్రభుత్వం, పోలీసులు నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం తీవ్రంగా విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన కామ్రేడ్ మధు, ఐలన్న, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, మోహనరావు, సుభాన్, ప్రకాష్, జానకి తదితర నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బుదాన్ పేదలతో కలిసి ప్రభుత్వం పై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, పోచారం ఉప సర్పంచ్ కోడి పాపయ్య, నరసయ్య, భద్రన్న, బిచ్చ, పీవైఎల్ కార్యదర్శి దేవా,ఏఐకెఎంఎస్ నాయకులు నాగన్న, పాపన్న, నర్సయ్య, యశోద, రమేష్ తదితరులు పాల్గొన్నారు. పేదల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.




## తండా శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి రూ.10,016 విరాళం

**❑ భక్తి చాటిన వెంకట్**

ఖమ్మం సింగరేణి ప్రతినిధి:( జన సంఘర్షణ)



తండా శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల చిన్న వెంకయ్య వారి మనవడు వెంకట్ (జ్యోతి ట్రేడర్స్) రూ.10,016లను విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు ఈ విరాళం ఎంతో ఉపయోగపడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, గ్రామ దేవాలయాల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని, భక్తి భావంతో తాను ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, భక్తులు వెంకట్ సేవా స్పూర్తిని అభినందిస్తూ, మరింత మంది యువత కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని కోరారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వంకుడోత్ నరేష్ నాయక్, సతీష్, అఖిల్, అనిల్, సాయి తేజ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రంగరాజు సేవలు మరువలేనివి

కార్వేటినగరం మార్చి 22 ( జన సంఘర్షణ):




తన తండ్రి రంగరాజు సేవలు మరువలేవని రిటైర్డ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. కార్వేటినగరం మండలం ఆర్‌కేవిబి పేట పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన తండ్రి రంగరాజు పదవ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సిన సమావేశంలో రిటైర్డ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం కోసం గ్రామాన్ని దత్తత తీసుకొని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. గ్రామంలో ఎవరికైనా ఆపరేషన్లు చేయాలంటే ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా, వాకర్స్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో దాదాపు 1000 మందికి పైగా వైద్యం పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. మొదట రంగరాజు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. వైద్య శిబిరానికి వచ్చిన డాక్టర్లను గ్రామస్తులను ఘనంగా సన్మానించారు. వికసిద్భారత్ స్వచ్ఛనారి స్వశక్తి పరివార్ అభియాన్ పబ్లిక్ ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నివారణ సభ్యులు నగలపాటి నాగేశ్వరరాజు, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్ రాయలు, మండల ప్రధాన కార్యదర్శి రాజా, నాయకులు చంద్రమౌళి, రాము, హేమంత్ రెడ్డి, దాము, చంగల్ రాయలు, వైద్యులు డాక్టర్ వెంకటరమణ, గుండె వైద్యులు, కంటి వైద్యులు సురేంద్ర, మెదడు వ్యాధి నిపుణులు రేవంత్ రెడ్డి, ఆశ్రిత, మారుతీ కృష్ణ, సురేష్ నాగజ్యోతి, సుభాషిని, జయప్రకాష్, హనీష, రవి సూర్య రామలక్ష్మి, వల్లి లాస్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు రవాణా శాఖ నజర్ ప్లీజ్

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ )



ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుండి మహబూబాబాద్ జిల్లాను కలిపే ప్రధాన రహదారి ప్రస్తుతం పూర్తిగా దయనీయ పరిస్థితికి చేరుకుంది. ఒకప్పుడు ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉన్న ఈ రహదారి ఇప్పుడు గుంతల మయంగా మారి ప్రయాణికులకు నరకయాతనగా మారింది. రహదారి పొడవునా ఎక్కడ చూసినా గుంతలు, గతుకులు కనిపిస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయం అయిన రహదారి ఇల్లందు నుండి మహబూబాబాద్ వరకు వెళ్లే ఈ రహదారి ప్రస్తుతం గుంతలతో నిండిపోయి వాహనదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు నెమ్మదిగా నడపక తప్పని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రెండు చక్రాల వాహనదారులు ప్రతి క్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో కూడా గుర్తించలేని పరిస్థితి నెలకొంది.ప్రయాణికులకు నరకయాతన ప్రతిరోజూ వందలాది మంది ఈ రహదారిపై ప్రయాణం చేస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు తమ రోజువారీ పనుల నిమిత్తం ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటారు. కానీ రహదారి పరిస్థితి కారణంగా వారి ప్రయాణం నరకయాతనగా మారింది. బస్సులు కూడా ఈ మార్గంలో నడవడం కష్టంగా మారింది.గుంతల కారణంగా వాహనాలు తరచూ దెబ్బతింటుండటంతో వాహనదారులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారింది. చీకటిలో గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు ఒక్కసారిగా గుంతల్లో పడిపోతున్నాయి. దీంతో చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు పెద్ద ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారు.

**వర్షాకాలం రాకముందే చర్యలు అవసరం**

ఇక మరోవైపు త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇప్పుడే రహదారి పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే వర్షాలు ప్రారంభమైన తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల సమయంలో ఈ గుంతలు నీటితో నిండిపోతే వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని మరమ్మత్తు చేయకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముంది. అధికారుల నిర్లక్ష్యం పై ప్రజల ఆగ్రహం ఇంతటి సమస్య నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటివరకు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ఇలా ఆటలాడటం సరైనదా అని ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇల్లందు మహబూబాబాద్ రహదారిని వెంటనే పరిశీలించి అత్యవసరంగా మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు రవాణా శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకుంటారా...? లేక మరొక పెద్ద ప్రమాదం జరిగాకే స్పందిస్తారా...? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## కార్వేటినగరం ఎస్ఐ ని సన్మానించిన ముస్లిం నాయకులు

కార్వేటినగరం మార్చి 22 ( జన సంఘర్షణ):



కార్వేటినగరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ తేజస్విని ముస్లిం నాయకులు ఆదివారం పోలీస్ స్టేషన్లో ఘనంగా సన్మానించారు. గత నెల రోజులు రంజాన్ నెల ప్రతిరోజు మసీదు వద్దకు వచ్చి విధులు నిర్వహించిన సందర్భంగా ఆమెను ముస్లిం నాయకులు ముత్తు వల్లి హమీద్ ఖాన్ , ఉస్మాన్, నౌషాద్, దస్తగిరి, ముజీబ్, మహబూబ్ బాషా, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా విజయవంతంగా భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత






❑ ఉద్యోగార్థులకు నియామాక పత్రాలు అందజేత

కామారెడ్డి/మార్చ్ 22/ (జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్శి రాముల కళ్యాణ మండపంలో జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. జాబ్ మేళాకు కామారెడ్డి, బిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, బీబీపెట్, పాల్వంచ, రామారెడ్డి మండలాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి భారీగా యువత ఇంటర్వ్యూకు హాజరయ్యారు. నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, జాబ్ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. 50 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరు కాగా, 3500 మంది నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొన్నారు. ఇందులో టెక్నీకల్, నాన్ టెక్నీకల్, ఐటి, ఫార్మ, మెడికల్, బ్యాంకింగ్, వెల్ఫేర్, రియల్ ఎస్టేట్ తదితర రంగాల నుంచి కంపెనీలకు సంబందించిన వాటికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఎంపికైనా 325 నిరుద్యోగ యువతకు నియామాక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిండ్ల అంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, సబ్బని కృష్ణహరి, నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జూలూరి సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమిది,మహేష్, తాటి ప్రసాద్, రాంశెట్టి హర్షిత, మాజీ కౌన్సిలర్లు, పంపరి శ్రీనివాస్,శంకర్ రావ్, చాట్ల వంశీ, కాంగ్రెస్ నాయకులు పంపరి లక్ష్మణ్, జమిల్, రవీందర్ గౌడ్, రంగా రమేష్ గౌడ్, నర్సోళ్ల మహేష్, బల్ల శ్రీనివాస్, నిరంజన్, మెహర్ బాబా, గంగారాములు, తదితరులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చారు... నిలబెట్టారు...

❑ ఫాదర్ కొలంబో చిన్నారి కానుక పథకం కింద రూ.5000 ఆర్థిక సహాయం

కరుణాపురం, మార్చి 22 ( జన సంఘర్షణ )

కరుణాపురం గ్రామంలో సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అమ్మాయి పుడితే రూ.5000 ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఇటీవల కరుణాపురం గ్రామానికి చెందిన ఆకారపు హరీష్-బిందు దంపతులకు పాప జన్మించగా, సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ వారి నివాసానికి వెళ్లి "ఫాదర్ కొలంబో చిన్నారి కానుక" పేరుతో రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ హామీ నిలబెట్టుకున్నందుకు అభినందనలు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకారపు అనిల్ కుమార్, వార్డు మెంబర్ ఆకారపు అరుణ్, రాజారాపు సుమన్, రాజారాపు ప్రమోద్, పురుమాణి కిరణ్ యాదవ్, పాశం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# నీటిని పొదుపుగా వాడుకుందాం

కార్వేటినగరం మార్చి 22 ( జన సంఘర్షణ )

మానవ అవసరాలకు నీటిని పొదుపుగా వాడుకుని నీటి కొరతనుండి భావితరాలను కాపాడుకుందామని డీ.ఎం.పురం విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసారు. గణిత ఉపాధ్యాయులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఎండాకాలం గ్రామాల్లో నీటి కొరత వేధిస్తోందని ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. జల సిరులు తరగని సంపదగా మార్చుకోవాలంటే భూగర్భ జల నిల్వల పెంపు, మొక్కలు నాటడం, నీటివ వినియోగం పై అవగాహనతో మెలగాలన్నారు. రాబోయే తరాలలో నీటి యుద్ధాలు నివారించాలంటే ఇప్పటినుండే ప్రతి ఒక్కరు నీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నీటి బొట్టు ఒడిసి పట్టు బంగారు భవిష్యత్తు నిర్మించు అంటూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.కార్యక్రమం లో విద్యార్థులు, నాయకులు దివాకర్, గ్రామస్థులు రాజశేఖర్, చెంగల్రాయులు పాల్గొన్నారు.




## గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన గ్రంథాలయ చైర్మన్

పలమనేరు, మార్చి 22 (జన సంఘర్షణ)



మండల కేంద్రంలోని స్థానిక పలమనేరు శాఖ గ్రంథాలయంను ఆదివారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువా రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయశీలోని పలు రికార్డులు రిజిస్టర్లు పరిశీలించారు. గ్రంథాలయంలోని సౌకర్యాలపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠకులకు అందుబాటులో ఏ పుస్తకాలున్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఏ పుస్తకాలు తెప్పిస్తున్నారు. తదితర అంశాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని నిరుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలని కాకుండా విజ్ఞానాన్ని ఇచ్చే పుస్తకాలను కూడా చదవాలని ,అవి గ్రంథాలయాల్లో మాత్రమే లభిస్తాయని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి హేమంత్ కుమార్, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ చొరవతో విశాఖలో సెమీ కండక్టర్ల తయారీ

కుప్పం,మార్చ్ 22 (జన సంఘర్షణ):



ఆంధ్రప్రదేశ్లో సెమీకండక్టర్ల తయారీ రంగం అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. విశాఖపట్నంలో భారీ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. అడ్వాన్స్డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎస్ఐపీ) సంస్థ ఈ యూనిట్ను స్థాపించనుండగా, ఇందుకోసం మొత్తం రూ.2,387.81 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు కోసం విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 30 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

❑ మండల దేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ

రామకుప్పం మార్చి 22 (జన సంఘర్షణ)



ఈనెల 26న రామ్ కుప్పం మండలంలో పర్యటించునున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామ్రాజు నాయక్ లు పేర్కొన్నారు ఆదివారం స్థానిక సుబ్రమణ్య స్వామి ఆలయ సమీపంలో మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకుప్పం మండలంలో పర్యటించిన నారా భువనేశ్వరి కార్యక్రమాలను వివరించారు . మొదట స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట నిర్మిస్తున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించునున్నట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహేంద్ర లో మినీ పార్కును ప్రారంభించనున్నారు .చివరిగా బల్ల గ్రామంలో మహిళతో ముఖాముఖి, సమావేశంలో పాల్గొన్న ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు చలపతి, మాజీ వైస్ ప్రెసిడెంట్ చిన్నకృష్ణ, మాజీ సర్పంచులు జి రామకృష్ణ, అప్ప పివి సీతాపతి రాము మూర్తి, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పాత్ర నారాయణ చారి తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## శిధిలావస్థలో ఉన్న త్రాగునీటి ట్యాంక్

కార్వేటి నగరం మార్చి 22 (జన సంఘర్షణ)



కార్వేటి నగరం మండలం కేశవ కుప్పం పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీలో సమీపంలో త్రాగునీటి ట్యాంకు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అయితే ట్యాంక్ నిర్మించినప్పటి నుంచి లీకేజీ శిథిలావస్థలో చేరుకుంది. ఈ పంచాయతీలో 500 కుటుంబాలు రెండువేల మంది జనాభా కలిగి ఉన్నారు. ఈ పంచాయతీ బోర్వెసి మూడు గ్రామాలకు పైప్లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ త్రాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉంది. ప్రస్తుతం ఈ ట్యాంకు పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్ స్పందించి త్రాగునీటి ట్యాంకును నూతనంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వ్యాసరచన పోటీల్లో మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థి ప్రతిభ

పలమనేరు, మార్చి 22 (జన సంఘర్షణ)




తెలుగు సాహిత్య సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో పలమనేరు రూరల్ మండలంలోని డి. కల్లాడు మోడల్ ప్రైమరీ పాఠశాల చెందిన నాలుగవ తరగతి విద్యార్థి వెంకటేష్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తనదైన శైలిలో అద్భుతమైన వ్యాసాన్ని రచించిన వెంకటేష్, ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. ఆదివారం స్థానిక కళామందిరంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు విద్యార్థికి బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, తులసినాథం, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వెండి నాగ పడిగల కోసం తిరుపతి గంగమ్మ ఆలయ అర్చకులు సోము స్వామి విరాళం

కుప్పం,మార్చ్ 22 (జన సంఘర్షణ)



కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థానంలో అమ్మవారికి వెండి నాగ పడగలు తయారు చేయించేందుకు గాను దేవాలయ ప్రధాన అర్చకులు సోమశేఖర శాస్త్రి తన వంతు విరాళం అందజేశారు. సోమశేఖర్ శాస్త్రి శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానంకు10,000 రూపాయలు చెల్లించినారు. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా నగదు చెల్లింపు రసీదు అందుకున్నారు.

# 120 మందికి వైద్య పరీక్షలు

**సదుం మార్చ్ 22 జన సంఘర్షణ:**




సదంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయ ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత వైద్య శిబిరము, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కూపన్లను పంపిణీ చేశారు. ఈ కూపన్ల ద్వారా ఉచితంగా తమ వైద్యశాలల్లో కంటి పరీక్షలు చేస్తామని చెప్పారు. ఆస్టర్ నారాయణద్రి వైద్యశాల వైద్యులు, సిబ్బంది రోగుల పరీక్షించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు రాజారెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, సుబ్రమణ్య స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు మోహన్ రెడ్డి, మేస్త్రి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో నాలుగు రోజుల నారా భువనేశ్వరి పర్యటన

**కుప్పం,మార్చ్ 22 జన సంఘర్షణ:**



ముఖ్యమంత్రి సతీమణి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజులు పాటు పర్యటిస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నారా భువనేశ్వరి కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కుప్పం నియోజకవర్గంలో 4 రోజులపాటు నారా భువనేశ్వరి పర్యటన ఉంటుందన్నారు.ఈ నెల 24 వ తేదీన కడపల్లి వద్దనున్న నివాసంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారు.మంకలదొడ్డి గ్రామంలో మహిళలలో ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది.అంగన్వాడీ సెంటర్ ను సందర్శిస్తారు.సింగారపురం గ్రామంలో మహిళలతో సమావేశం ఉంటుంది.మొట్లచెను గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం.కూసూరులో మహిళలతో సమావేశం.రైతన్న మీ కోసం లబ్ధిదారుల ఇళ్లను సందర్శించనున్న భువనేశ్వరి.పైపాల్యం గ్రామంలో విలువల బడిలో భాగంగా విద్యార్థులతో సమావేశం. టీటీడీ కళ్యాణమండపంలో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొంటారు. ఈ నెల 25న ప్రజల నుండి అర్జీలు తీసుకుంటారు. కడ అడ్వైజర్ మెంబర్ రాజకుమార్ ఇంటి గృహప్రవేశంలో పాల్గొంటారు. కుప్పం డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాలో పాల్గొనున్నారు.పెద్దకోటకనపల్లిలో మహిళలతో సమావేశం. తంబిగానిపల్లిలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ ఇంటికి వెళ్లనున్నారు. ఈ నెల 26 న ప్రజల నుండి అర్జీలు తీసుకుంటారు.శాంతిపురం మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు.

## వెటరన్ రన్నర్ రామ సుబ్బమ్మకు విపిఆర్ దంపతుల సన్మానం

**నెల్లూరు జిల్లా జన సంఘర్షణ:**



కావలికి చెందిన 80 ఏళ్ల బామ్మ, వెటరన్ రన్నర్ రామ సుబ్బమ్మను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నెల్లూరులోని విపిఆర్ నివాసానికి చేరుకున్న ఆమెను విపిఆర్ దంపతులు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆమె జాతీయ స్థాయిలో సాధించిన పథకాలు చూసి వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వయసులో జాతీయ స్థాయిలో 32 స్వర్ణ, 14 సిల్వర్, 3 బ్రాంజ్ పథకాలు సాధించడం గొప్ప విషయమని చెప్పారు. ఇలాంటివారు ఎంతో మందికి ఆదర్శమని అన్నారు. సందర్భంగా రామ సుబ్బమ్మ తనకు ప్రభుత్వం తరపున ఇల్లు కేటాయించేలా చూడాలని ఎంపీ దంపతులకు విజ్ఞప్తి చేయగా వారు తప్పకుండా ఇల్లు కేటాయించేలా ప్రయత్నిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రామ సుబ్బమ్మ కుమారులు మహేష్, కుమార్తె జయలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.పీ గ్యాస్ గోడౌన్ను తాసిల్దార్ ఆకస్మిక తనిఖీ




**కోట మార్చ్ 22 జన సంఘర్షణ:**

గ్యాస్ సిలిండర్లు సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని కోట తహసీల్దార్ కటారిజయ జయ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కోట మండలంలోని విద్యానగర్ కొత్తపాలెం రోడ్డు సమీపంలో ఉన్న హెచ్‌పి గ్యాస్ గోడౌన్ లోని సిలిండర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులకు ఇబ్బందులు కలిగితే చట్టపరమైన చర్యలు చేపడుద్దామని హెచ్చరికలు జారీ చేశారు.

# రైతుల శ్రమను నిలువునా దోచుకుంటున్న మండి వ్యాపారస్తులు

◆ **చోద్యం చూస్తున్న అధికారులు**

**రామకుప్పం మార్చ్ 22 జన సంఘర్షణ:**

ఆరుగాలం శ్రమించి లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట ప్రతిఫలం దళారులు దోచుకుంటున్నారు. కంటికి రెప్పలా రాత్రింబవళ్లు రైతులు భూమిని నమ్ముకొని వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. దీంతో గిట్టుబాటు ధర లభిస్తోందని కొండంత ఆశతో సాగుచేసిన శ్రమ ఒకరిది ఫలితం మరొకరికి గా మారింది. ఇటీవల రైతులు బంతిపూలు కోసు కాలీఫ్లవర్ టమాట బంగాళాదుంప బీన్స్ తదితర పంటలను సాగు చేశారు. సాగు సమయంలో సుమారు ఎకరాకు లక్షకుపైగా ఖర్చుపెట్టి దిగుబడి సాధిస్తున్నారు. సమీపంలో మార్కెట్ సౌకర్యం లేక వీకోటలోనున్న తరలిస్తుంటారు అక్కడ సిండికేట్ గానున్న వ్యాపారస్తులు వారు నిర్ణయించిన దరికే పంటను విక్రయించాల్సి వస్తుంది. సుమారు నెలలు తరబడి లక్షలు హెచ్చించి దిగుబడి సాధించిన రైతుకు లాభాలు లభించక క్షణం పాటులో వ్యాపారస్తులు రైతులను దోచుకుని లక్షలు సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు నిదర్శనంగా వీకోట మార్కెట్లో ఈనెల 21వ తేదీన వ్యాపారస్తుల మధ్య చోటుచేసుకున్న వివాదం రైతుల కష్టం దళారుల పాలవుతున్నట్లు తెలుస్తోంది ఏది ఏమైనా తరతరాలుగా భూమిని నమ్ముకుని సాగు చేస్తున్న రైతులు బాగుపడిన దాఖలాలు లేవు. అదే చిన్న చిన్న వ్యాపారం చేసుకుంటున్నా దళారులు లక్షల్లో దినదిన అభివృద్ధి చెందుతున్నారు. కొంటె కొరివి అమ్మితే అడివిసామెత లాగా రైతుల పరిస్థితి కొనసాగుతోంది ప్రభుత్వాలు ప్రజా ప్రతినిధులు మారిన రైతుల తలరాతలను మార్చే దిక్కు లేక నిరంతరం సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటారు రామకుప్పంలో అలంకారప్రాయంగా మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టారు. కానీ రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వికోటాలోనున్న మార్కెట్ కు తరలించి తీవ్రంగా నష్టపోతుంటారు ఈ సమీపంలోనున్న మార్కెట్ యార్డులపై రైతులకు నమ్మకం లేక మెద్రాస్ మార్కెట్ కు పలువురు తరలిస్తుంటారు కానీ దూర ప్రాంతంలోనున్న మార్కెట్ సమాచారం తెలియక వారు నిర్ణయించిన దరికి పంటలను విక్రయించాల్సి వస్తోంది. వివిధ రంగాల్లో పలువురు వారి స్వశక్తితో అభివృద్ధి



చెంది ఉన్నత స్థాయికి ఎదిగిన సందర్భాలు ఉన్నాయి . కానీ రైతులు ఎటువంటి పంటలు సాగుచేసిన గిట్టుబాటుదారు లేక గిట్టుబాటు ధర లభించిన దళారుల చేతిలో మోసపోవడం వంటి సంఘటనలు నిత్యం మండలంలో కోకోలోలుగా వెలుగుచూస్తున్నాయి. రైతులు నిరంతరం రాత్రింబవళ్లు కష్టపడిన ఫలితాలు దళారుల పాలో అవుతున్నాయని వాపోతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ యంత్రాంగం రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకునే చెరువులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## రామ కుప్పంలో గ్రామ సింహాలుజోరు... జనం బేజారు

**రామకుప్పం మార్చి 22 జన సంఘర్షణ:**



మండల కేంద్రమైన రామకుప్పంలో వీరి వీధికి వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో సామాన్య జనం కాలినడకన వెళ్లడానికి భయంతో వణికి పోతున్నారు. ప్రతి వీధిలో సుమారు 20 శునకాలకు పైగా సంచరించడం జరుగుతోంది. దీంతో ఇళ్ల వద్ద కోళ్లు చిన్నచిన్న పశువులు పెంచుకోవడం కష్టంగా మారింది. ఏమాత్రం అజాగ్రత్త పడితే కోళ్లను, గొర్రెలు, మేకలను చంపి తినేస్తుంటాయి. అదే విధంగా ప్రజల సైతం తరచూ కుక్క కాటుకు గురవుతుంటారు. పిల్లలు, పెద్దవారు, వృద్ధులు తేడా లేకుండా తరచూ సునకాలు మీద పడి దాడి చేస్తుంటాయి. ఏ క్షణంలో మీదకు వచ్చి దాడి చేస్తా అంటూ వణికిపోతున్నారు. గతంలో పలుమార్లు సునకాలను బంధించి దూరప్రాంతాలకు తరలించడం చోటుచేసుకోండి. కానీ గ్రామంలో గ్రామ సింహాలు అధికమైన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని జనం వాపోతున్నారు. ఇదిలా ఉండగా శూన్యాలను కట్టిడి చేసే ప్రయత్నం చేయకపోవడంతో ఏ క్షణంలో ఏ వీధిలో కుక్కల సమస్య ఎదురవుతుందో చెప్పలేని పరిస్థితిలో గ్రామస్తులు కలిసిపోతున్నారు .ఏదేమైనా పంచాయతీ అధికారులు గ్రామ శునకాలపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సునకాలు జనం మీదకు వచ్చిన వాటినుండి ప్రాణాలను రక్షించుకోలేని స్థాయిలో శునకాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఏదేమైనా సంబంధిత అధికారులు స్పందించి శునకాల పైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు జిల్లా జన సంఘర్షణ:**






17 మంది శాసన మండలి సభ్యులు, వైసీపీ నేతలతో కలిసి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణని పరామర్శించిన ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణని విజయనగరం లోని వారి నివాసంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి గురించి చంద్రశేఖర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# అభివృద్ధికి చిరునామా రూరల్ నియోజకవర్గం యంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు జిల్లా జన సంఘర్షణ:**

ఒకేరోజు 240 పనుల ప్రారంభోత్సవం గొప్ప విషయం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రాన్ని సీఎం అభివృద్ధి చేస్తున్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలు తీసుకువస్తున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఒకేరోజు 240 ప్రాంతాల్లో 240 అభివృద్ధి పనులను ప్రారంభించడం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికే సాధ్యమైందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని పడారుపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా పడారుపల్లికి చేరుకున్న నేతలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. భారీ గజ మాలతో ఘన సత్కారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 27 కోట్లతో 240 పనులు చేపట్టి రూరల్ ప్రజలకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతులు కల్పించారన్నారు. చాలామంది అభివృద్ధి పనులు చేస్తుంటారని, కానీ రూరల్ ఎమ్మెల్యే స్టైలే వేరని చెప్పారు. గతంలో ఒకేరోజు 41 కోట్లతో 339 పనులు ప్రారంభించి రికార్డు సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఇప్పటివరకు రూరల్ నియోజకవర్గానికి 614 కోట్ల నిధులు సాధించారన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు 140 కోట్లు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన సీఎం చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కి, రూరల్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వేలాది కోట్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అందజేస్తున్నారని అన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దివ్యాంగులకు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో ఇప్పటికే పరిశ్రమలు స్థాపిస్తురని, ఇటీవల జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన చేశారన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాలతో పాటు త్వరలోనే ఆమంచర్ల వద్ద ఎంఎస్ఎంఈ పార్క్‌లో భారీ పరిశ్రమ రాబోతోందని వెల్లడించారు. యువ నేత నారా లోకేష్ ఆధ్వర్యంలో తాము పనిచేస్తుండటం సంతోషంగా ఉందని, ప్రజలకు కూటమి ప్రభుత్వ హయాంలో మంచి జరుగుతందని ఆయన అన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, శ్రీరామనవమికి ముందుగానే నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర కనిపిస్తోందన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. నెల్లూరు రూరల్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇది ఒకప్పుడు తాను ప్రాతినిధ్యం వహించిన రాపూరు నియోజకవర్గ పరిధిలో భాగమని గుర్తుచేశారు. ఎమ్మెల్యేకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రూరల్ అభివృద్ధిలో అందరం భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు. నగరాభివృద్ధి కోసం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమన్వయంతో మేయర్, డిప్యూటీ మేయర్ నిధులను సమీకరించి నగర కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. దేవాదాయశాఖ పరంగా రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, 29 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ప్రతి నెలా రూ.10,000 చొప్పున సహాయం అందిస్తున్నామని చెప్పారు. నాలుగు పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి ?10.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా కొత్త ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 పైగా ఆలయాలను రూ.700 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. 2027లో గోదావరి, 2028లో కృష్ణ పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. రైతాంగానికి అండగా జిల్లాలో 161 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటికే 18,013 మెట్రిక్ టన్నుల



ధాన్యాన్ని సేకరించి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎంత ధాన్యం ఇచ్చినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. రాష్ట్రంలో జనగణన అనంతరం డీలిమిటేషన్ ప్రకారం అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉందని, నెల్లూరు మూడు నియోజకవర్గాలుగా మారే అవకాశం ఉందని సూచించారు. కష్టపడి పని చేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. 2029 నాటికి తన రాజకీయ ప్రస్థానం 46 సంవత్సరాలు పూర్తవుతుందని, సుదీర్ఘ కాలం పాటు ప్రజల మధ్య గడుపుతూ ఎటువంటి మచ్చ లేకుండా రాజకీయ జీవితం కొనసాగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రజలు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్వయంకృషితో ఎదిగిన నాయకుడని, కోటంరెడ్డి సోదరులతో తనకు సోదర భావం ఉందని, వారి భవిష్యత్తుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.

# మత్స్యకారులకు అన్యాయం చేస్తే ఊరుకోం

◆ మాజీమంత్రి కాకాణి

**నెల్లూరు జిల్లా, జనసంఘర్షణ:**
బోట్ల అపహరణ వెనుక నారా లోకేష్. ఎంపీ బీఎంఆర్ సహా టీడీపీ నాయకుల కుట్ర. నెల్లూరు కలెక్టరేట్‌లో మంత్రి కొల్లు రవీంద్ర ప్రణాళిక. మత్స్యకారులకు అన్యాయం చేసినోళ్లని వదిలిపెట్టం. తీవ్రంగా హెచ్చరించిన నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. నెల్లూరు లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మీడియా సమావేశంలో ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీధర్, మత్స్యకార గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అండగా నిలవాల్సిన పోలీసులే బెదిరించి వేధిస్తున్నారు. మత్స్యకారుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు వైయస్ జగన్ ఇచ్చిన ఆస్తి. హార్బర్ ప్రైవేటీకరణతో మళ్లీ వారి జీవితాలను ఆగం చేస్తున్నారు. మత్స్యకారులకు వైయస్సార్సీపీ అండగా నిలబడి పోరాడుతుంది. స్పష్టం చేసిన వైయస్సార్సీపీ నాయకులు కాకాణి, మేరుగ మురళీధర్, రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి. మత్స్యకారుల ఆధీనంలో ఉన్న తమిళ జాలర్ల బోట్లను వారికి చెప్పకుండా అపహరించడం వెనుక మంత్రి నారా లోకేష్, ఎంపీ బీదా మస్తాన్ రావు సహా టీడీపీ నాయకుల ప్రమేయం ఉందని తోటయ్య వీడియోనే సాక్షిగా రుజువైందని, ఆ బోట్లను తక్షణం తెచ్చి యథాస్థానంలో ఉంచాలని నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులో జిల్లాలోని పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మేరుగ మురళీధర్ లతో పాటు మత్స్యకార నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బోట్ల అపహరణకు నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వేదికగా మంత్రి కొల్లు రవీంద్ర ప్రణాళిక రూపొందించారని, దీనికి ముఖ్యమంత్రి సహా, మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్ర, జిల్లా ఎస్పీ, కావలి డీఎస్పీ, సీఐ అందరూ సమాధానం చెప్పాలన్నారు. మత్స్యకారులకు వైయస్సార్సీపీ అండగా నిలబడి పోరాడుతుందని, వైయస్ జగన్ సీఎం అయ్యాక ఈ కుట్రపై పూర్తిగా విచారణ జరిపి దాని వెనుక ఇంకా ఎవరెవరున్నారో వాళ్లందర్నీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మత్స్యకారుల కష్టాలను చూసి చలించిపోయి వారి కోసం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ఫిషింగ్ హార్బర్ భూముల్లో 30 ఎకరాలు సాగర్ డిఫెన్స్‌కి కేటాయించడం మత్స్యకారుల కడుపుకొట్టడమేనని మండిపడ్డారు. మత్స్యకారులకు వైయస్సార్సీపీ అండగా ఉంటుందని, వారి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం త్వరలోనే సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీధర్ స్పష్టం చేశారు. వారు ఇంకా ఏమన్నారంటే:



టీడీపీ నాయకులే కుట్ర చేసి తరలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నెల్లూరు జిల్లాలో మత్స్యకారుల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరిస్తోంది. తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చి మన జలాల్లోకి ప్రవేశించి మన మత్స్యసందపను దోచుకునిపోతున్న బోట్లను జాలర్లతో సహా మన మత్స్యకారులు ప్రాణాలకు తెగించి పట్టుకున్నారు. 4 మెకనైజ్డ్ బోట్లను మన ఆధీనంలోనే ఉంచుకోవడం జరిగింది. అయితే తమిళ జాలర్లతో కుమ్మక్కైన టీడీపీ నాయకులు, మన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఆ బోట్లను విడిపించారు. ఇది రాజకీయాలకు అతీతంగా డీల్ చేయాల్సిన అతి సున్నితమైన ఈ అంశం. అందుకే మొన్న జువ్వలదిన్నె ప్రైవేటీకరణపై చేపట్టిన నిరసన సందర్భంగా కూడా ఈ విషయాన్ని వైయస్సార్సీపీ నాయకులెవరూ ప్రస్తావించలేదు. టీడీపీ నాయకుల సాయంతో పట్టుకెళ్లిన బోట్లను పోలీసుల సాయంతో తిరిగి యథాస్థానంలో తెచ్చి పెడతారని మూడు రోజులుగా చూశాం. కానీ దానికి భిన్నంగా వ్యవహరిస్తూ ఒకరిపైఒకరు చెప్పుకుంటూ మాకేమీ పట్టదన్నట్టు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు.

వీడియో సాక్షిగా టీడీపీ కుట్ర బట్టబయలు. నిబంధనల ప్రకారం మెకనైజ్డ్ బోట్లతో 22.2 నాటికల్ మైళ్ల దూరంలో వేట కొనసాగించాలి. కానీ తమిళ జాలర్లు తీరప్రాంతం వరకూ వచ్చి మనవాళ్లు కట్టుకున్న వలలను తెంచి పడేసి, వారి మెకనైజ్డ్ బోట్లతో మన వారి బోట్లను ధ్వంసం చేసి మత్స్య సంపదని దోచుకెళ్లి పోతున్నారు. దీంతో మన మత్స్యకారులు జీవన భృతికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఎంతోకాలంగా జరుగుతున్న ఈ దారుణాలపై పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకున్న పాపానపోవడం లేదు. పోలీసులు చేయాల్సిన పని చేయకపోయినా, మత్స్యకారులు ప్రాణాలకు తెగించి ఆ బోట్లను జాలర్లతో సహా నిర్బంధిస్తే వాటిని ఎవరికీ చెప్పకుండా వదిలేయడం దుర్మార్గం. మన మత్స్యకారుల కడుపు కొట్టడమే. ఈ బోట్లను అక్రమంగా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన నాయకులెవరో ఇస్కపల్లెపాలెం గ్రామానికి చెందిన కాపు తోటయ్య స్పష్టంగా చెప్పాడు. మంత్రి నారా లోకేష్ నెల్లూరు పర్యటనకు వచ్చినప్పుడు బోట్లు తరలిస్తున్నామని కావలి సీఐ ఫోన్ చేసి చెప్పాడని, దీంతోపాటు ఎంపీ బీదా మస్తాన్ రావు నాతో రెండు నెలలుగా మాట్లాడుతున్నాడని ఆ బోట్లను తప్పిస్తే ఒక్కో బోటుకు రూ.10 లక్షల చొప్పున రూ. 40 లక్షలు చెల్లిస్తామని చెప్పాడని వెల్లడించాడు. (ఇందుకు సంబంధించి తోటయ్య మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు). రెండు రోజులు అరిచి గోల చేసి ఆ తర్వాత మత్స్యకారులే గమ్మునుంటారులే అని టీడీపీ నాయకులు భావించారు. అందుకే కుట్ర పన్ని అర్ధరాత్రి బోట్లను అక్రమంగా తరలించారు. ప్రధాన సూత్రధారి బీఎంఆర్, వ్యూహకర్త కొల్లు రవీంద్ర. అక్రమంగా బోట్లు తరలించే కుట్రలో ప్రధాన సూత్రధారే బీదా మస్తాన్‌రావు. అయినా తనకే సంబంధం లేదన్నట్టు ప్రధాని, కేంద్ర హోంమంత్రి, కేంద్ర మత్స్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి పేర్లు మధ్యలోకి తీసుకొచ్చి కళ్లబొల్లి కబుర్లతో బిల్డప్ ఇస్తున్నాడు. తోటయ్య కాల్ డేటా చెక్ చేస్తే బీదా మస్తాన్‌రావు భండారం మొత్తం బయటపడి పోతుంది. వారిని ప్రలోభపెట్టి లోబర్చుకుని వారిని కుట్రకు ఉపయోగించు కోవడమే కాకుండా తీరా భండారం బయటపడ్డాక కాపు పెద్దను ఇరికించాలని చూస్తున్నాడు.

# కోటి యాభై లక్షలతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

◆ అభివృద్ధి ఏంటో చేసి చూపిన కూటమి ప్రభుత్వం
◆ బొమ్మసముద్రం అభ్యున్నతిలో భాగస్వామ్యమైన ఎంపీ, ఎమ్మెల్యేలు
◆ అభివృద్ధి, సంక్షేమ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్

**ఐరాల కాణిపాకం మార్చి 22 జనసంఘర్షణ:**
పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, బొమ్మసముద్రం ప్రగతి పథంలో దూసుకెళుతోంది. కోటి యాభై లక్షలతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి సకాలంలో పూర్తి చేసి, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపింది కూటమి ప్రభుత్వం. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ బొమ్మసముద్రం సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నిరూపించారు. ఇందులో ముఖ్యంగా బొమ్మసముద్రం పంచాయతీలోని తిమ్మోజిపల్లి, బొమ్మసముద్రం గ్రామాల్లో నూతనంగా



నిర్మించిన గోకులం షెడ్లు, చెరువు మొరవ కల్వర్టుల మరమ్మతులు, ఆరోగ్య కేంద్రం, ఎంపిపి పాఠశాల ప్రహరీ గోడ, నూతన పాఠశాల భవనాలు, సిమెంట్ రోడ్లు, బొమ్మసముద్రంలో దళితవాడలో నిర్మించిన కమ్యూనిటీ హాళ్ళను, ఆదివారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. అంతకు ముందు బొమ్మసముద్రం పంచాయతీకి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు కాణిపాకం ఆలయం పాలకమండలి చైర్మన్ మణినాయుడు, టిడిపి సీనియర్ నేత గిరి నాయుడు, ఐరాల మండలాధ్యక్షులు హరిబాబు నాయుడు నేతృతంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బాణా సంచా పేలుస్తూ, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. బొమ్మసముద్రం గ్రామ పంచాయతీలో అడుగడుగునా ఎంపీ, ఎమ్మెల్యేలకు కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా అక్కడే నూతనంగా ఏర్పాటు ఎన్టీఆర్ కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్.. టిడిపి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఐరాల జట్పీటిసి సుచిత్ర, తవణం పల్లె మండలాధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి, బంగారు పాళెం టిడిపి మండలాధ్యక్షులు ధరణి ప్రసాద్, బొమ్మసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ రఘు,ఐరాల మాజీ జట్పీటిసి లతమ్మ, యాదమర్రి మండలాధ్యక్షులు, బంగారు పాళెం ఏయంసి చైర్మన్ భాస్కర్ నాయుడు, టిడిపి నాయకులు చొప్పా నాని తదితరులతో కలిసి తారక రాముడికి ఘన నివాళులర్పించారు.

# గంజాయిని అరికట్టడం ఒక సామాజిక బాధ్యత...

**శ్రీకాళహస్తి మార్చ్ 22 జనసంఘర్షణ:**
ప్రజల మానప్రాణాలకు సైతం ప్రమాదకరంగా పరిణమించి, సమాజానికి పెను ముప్పుగా మారుతున్న గంజాయిని అరికట్టడం ఒక సామాజిక బాధ్యతగా ప్రజలంతా భావించి పోరాడాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణం, కొత్తపేటలోని రోడ్డుపై జరిగిన ఒక చిన్న సంఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులు బాధితులపై విచక్షణారహితంగా దాడులు చేయడం, దానిని నిలువరించే ప్రయత్నం చేసిన వ్యక్తులను కూడా తీవ్రంగా గాయపరిచే విధంగా దాడులు చేయడానికి మూల కారణం గొడవ చేసిన యువకులు గంజాయి సేవించడమే అని అనుమానాలు కలుగుతున్నాయి. ఇటువంటి గంజాయి సేవకులను తక్షణమే అదుపులోకి తీసుకొని, వారికి తగిన వైద్యపరమైన చికిత్స అందించి సమాజాన్ని కాపాడమని పౌర సమాజంలోని ప్రతీ ఒక్కరికీ వేడుకుంటున్నాము. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత గంజాయి వంటి మత్తు పదార్థాల నియంత్రణ విషయంలో ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి తగిన సూచనలు సలహాలు ఇస్తున్నారు. అయినప్పటికీ మన శ్రీకాళహస్తి పట్టణంలో ఇంకా గంజాయి వాసనలు అక్కడక్కడా మన దృష్టికి రావడం విచారకరం.గంజాయి నియంత్రణ, అరికట్టడం వంటి చర్యలు ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుంది అని, కాబట్టి గంజాయి వ్యవహారంలో ప్రజలు నిఘా పెట్టి, అధికారులకు సమాచారం అందించి, ప్రజల జీవితాలను కాపాడమని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ చైర్మన్ బీమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా పౌరసరఫరాల అధికారి

**మనుబోలు., 22.3.2026 జనసంఘర్షణ:**



జిల్లా పౌర సరఫరాల అధికారిణి బి. లీలారాణి సహాయ పౌర సరఫరాల అధికారి లక్ష్మి నారాయణ రెడ్డి ఆదివారం మనుబోలు మండలం నందు పర్యటించినారు. ఈ పర్యటనలో భాగంగా మనుబోలు నందలి ధాన్యం కొనుగోలు కేంద్రం నందు తనిఖీలు చేసి, పి.పిసి ఇంచార్జి మహేష్‌కి గన్ని బ్యాగులు, బ్యాంకు గ్యారెంటీల గురించి తగు సూచనలు ఇచ్చారు.తదుపరి బద్దెవోలు గ్రామంలో, పిడూరుపాలెం గ్రామాల్లోని రైతులు వద్దకు వెళ్లి ధాన్యము రాసులను పరిశీలించి, రైతులకు కనీస మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలియజేసినారు. వీరి వెంటఏ. యం సి.చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మండలాధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య , సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ రవి పాల్గొన్నారు. తదుపరి మనుబోలు టౌన్ పరిధిలోని వసుమతి హెచ్. పి.గ్యాస్ గ్రామిన్ విత్రక్ ఏజెన్సీ నందు తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించి, వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆన్లైన్ బుకింగ్ ప్రకారం గ్యాస్ సిలిండర్ల డెలివరి జరగాలని, బుకింగ్ సమయంలో 45 రోజులు కాల పరిమితి గురించి ప్రజలకు అవగాహన కల్పించమని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి సొసైటీ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య, కాగితాలపూరు నీటి సంఘం అధ్యక్షులు వెడిచర్ల వెంకటరమణారెడ్డి, కట్టువపల్లి టిడిపి నాయకులు ఎట్రపల్లి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నల్ల చట్టాలతో రైతుకు ఉరి...

◆ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

**శ్రీకాళహస్తి మార్చ్ 22 జనసంఘర్షణ:**



వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలు తీసుకొచ్చి కేంద్రం రైతు మెడకు ఉరిని బిగిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరిచే నల్ల చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అమలు చేసేందుకు పూనుకోవడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను ఆదివారం ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ కూడలి నుంచి సుందరయ్య భవనం వరకు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతుల సమక్షంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. తదనంతరం నిర్వహించిన బహిరంగ సభనుద్దేశించి ప్రభాకర్ మాట్లాడారు. ప్రతి ఏటా కార్పొరేట్లపై వరాల జల్లు కురిపిస్తూ రుణ రాయితీలు ఇస్తున్న కేంద్రం, రైతుకు గిట్టుబాటు ధర, రాయితీలు కల్పించడంలో వెనక్కి తగ్గుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటేటా పెట్టుబడి వ్యయం పెరుగుతోందే తప్ప, మద్దతు ధర మాత్రం కల్లగా మారుతోందని ధ్వజమెత్తారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండ కారణంగా రాష్ట్రంలోని మొక్కజొన్న, పత్తి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్రం మొద్దు నిద్ర నటిస్తోందని మండిపడ్డారు. సరైన విదేశాంగ విధానం లేకపోవడమే ఇందుకు కారణమంటూ విమర్శించారు. తిరుపతి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు అరకొరకే దళారులకు కష్టాన్ని అమ్ముకున్నారని వాపోయారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సరైన సాగునీటి పథకాలు లేకపోవడం వల్ల పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోందనీ, వెంటనే ఎస్ఎస్ కెనాల్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచితంగా బోర్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, పూర్వపు కార్యదర్శి అంగేరి పుల్లయ్య, కోశాధికారి ధనంజయ, మణి, అల్లెయ్య, రమణయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు చిన్న బజార్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలలో ఏఎస్పీ దీక్ష ఐ. పి.యస్. ఆధ్వర్యంలో దాడులు

**నెల్లూరు జిల్లా-జనసంఘర్షణ:**
నెల్లూరు నగరం, చిన్న బజార్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు లాడ్జిలలో ఏఎస్పి దీక్ష ఐ. పి.యస్. ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. లాడ్జిలలో అసాంఘిక కార్య కలాపాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఈ దాడులను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ దీక్ష మాట్లాడుతూ కొంతమంది లాడ్జి ఓనర్లు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారని ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. సుమారు 30 మంది విటులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



# ముస్లిం చిరు వ్యాపారస్థులకు రంజాన్ తోఫా పంపిణీ

**:- మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ ఆధ్వర్యంలో రంజాన్ కానుకలు**





**గోదావరిఖని,మార్చి 22 జనసంఘర్షణ**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో మక్కాన్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ లక్ష్మి నగర్,శివాజినగర్ ప్రాంతాలలోని ముస్లిం చిరు వ్యాపారస్థులకు రంజాన్ తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసాలను ఆచరించడం ద్వారా సహనం,సేవాభావం, దాతృత్వం పెంపొందుతాయని, రంజాన్ పండుగ సామరస్యానికి,పరస్పర గౌరవానికి ప్రతీక అని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,సేవాసమితి సభ్యులు మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మూసి సుందరీకరణ పేరుతో ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా మధు పార్క్ రిడ్జ్ నివాసితుల ఆందోళన

**ప్రజా అక్షరం మార్చ్ 22 జనసంఘర్షణ :**

మూసి నది సుందరీకరణ ప్రాజెక్ట్ నేపథ్యంలో మధు పార్క్ రిడ్జ్ ప్రాంతంలో ఇండ్ల కూల్చివేత చర్యలకు వ్యతిరేకంగా స్థానిక నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్లను కాపాడుకోవాలనే డిమాండ్తో మధ్య తరగతి కుటుంబాలు ఐక్యంగా నిరసనలు కొనసాగిస్తున్నాయి.నివాసితులు తెలిపిన వివరాల ప్రకారం, వారు ఎన్నో సంవత్సరాల కష్టంతో సంపాదించిన డబ్బుతో ఈ ఇళ్లను కొనుగోలు చేసుకున్నారు. ముఖ్యంగా పదవి విరమణ చేసిన ఉద్యోగులు తమ జీవిత పొదుపులతో ఇళ్లు కొనుగోలు చేశారని, ఇప్పుడు వాటిని కూల్చివేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.“2013 నుంచి ఇక్కడే నివసిస్తున్నాం. అప్పటి నుంచి ఎలాంటి సమస్యలు లేవు. ఇప్పుడు ఒక్కసారిగా ఇళ్లను కూల్చివేయాలని చెప్పడం సరైంది కాదు” అని ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పేర్కొన్నారు.ప్రభుత్వం మూసి నది శుద్ధి మరియు సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే అన్ని అనుమతులు ఉన్న ఇళ్లను కూల్చివేయడం తగదని నివాసితులు స్పష్టం చేశారు. “మూసిని శుభ్రం చేయండి, కానీ మా ఇళ్లు కూల్చొద్దు” అని వారు విజ్ఞప్తి



చేస్తున్నారు.గాంధీ విగ్రహం ఏర్పాటు వంటి పనుల కోసం తమ జీవనాధారాన్ని కోల్పోవడం అన్యాయమని, పేద మరియు మధ్య తరగతి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇప్పటికే నెలరోజులుగా మధు పార్క్ రిడ్జ్ నివాసితులు తమ ఇళ్లను రక్షించుకోవడానికి పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ,లకు లేఖలు రాసినట్లు తెలిపారు.అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇండ్లు, స్థలాలు స్వాధీనం చేసుకోవడం అన్యాయమని పేర్కొంటూ తక్షణమే న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నివాసితులు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శామీర్పేట్లో “మీ సమస్య మా పరిష్కారం” కార్యక్రమం నిర్వహణ


**మార్చ్ 22 జనసంఘర్షణ మేడ్చల్**

మేడ్చల్ నియోజకవర్గం, శామీర్పేట్ డివిజన్ పరిధిలోని శామీర్పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో “మీ సమస్య మా పరిష్కారం” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.సంఘం తరఫున ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకాన్ని మేడ్చల్ నియోజకవర్గ ప్రజలందరికీ ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా కృషి చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి ఎన్. హైమా రెడ్డి, ట్రెజరర్ శ్రీ రమేష్ అంబటి, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీ సుదర్శన్, అలాగే శ్రీమతి బి. సాయి కుమారి, శ్రీమతి పావని, శ్రీమతి జి. విజయలక్ష్మి, శ్రీమతి జై బూన్ తదితరులు పాల్గొన్నారు.





# అర్థిక సహాయం అందజేసిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత



**వలిగొండ మార్చ్ 22 జనసంఘర్షణ**

మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన పత్తేపు యాదగిరి గుండె మరియు కిడ్నీ సమస్యతో చాలా రోజుల నుండి బాధపడుతూ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులకి ఏజేఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో సమకూర్చిన 5000 వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ గ్రామ ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు.





**దౌల్తాబాద్ మార్చి 22 జనసంఘర్షణ**

దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన పొడి శెట్టి వినయ్ (40) రామంపేట నుంచి దౌల్తాబాద్ వైపు బైక్పై వస్తుండగా గోవిందాపూర్ గ్రామ మూల మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కిందపడిన వినయ్కు కుడికాలి మోకాలి వద్ద ఎముక విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. దౌల్తాబాద్ 108 అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ భాను ప్రకాష్, పైలట్ డి. నర్సింలు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి, అనంతరం సిద్దిపేట ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్, కోఆర్డినేటర్ కిరణ్ సూచించారు.

# కోదండ రామ ఆలయానికి విరాళం అందించిన సర్పంచ్

**బచ్చన్నపేట మార్చి 22 జ్రనసంఘర్షణ**



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో గత 15 సంవత్సరాలుగా గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి రంగులు లేక వెలవెలబోతుండడం చూసి మనసు చెలించిన గ్రామ సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్ కమిటీతో మాట్లాడి 70 వేల రూపాయలు ఇప్పించి గ్రామ సర్పంచిగా తనవంతుగా 20000 ఇరవై వేల రూపాయలు ఇచ్చి దేవాలయాలపై వారి కి ఉన్న తన ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు మరియు పురోహితులు మినలాపురం హనుమంతరావు కూడా తన వంతుగా 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది ఉప సర్పంచ్ చల్ల కమలాకర్ 10 వేల రూపాయలు తనవంతుగా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తాటికొండ రామాంజనేయులు మాజీ ఎంపిటిసి మల్లసిద్ధి రాములు వేముల లక్ష్మణ్ గౌడ్ ,అంబాల ప్రభాకర్ గౌడ్ కలకుంట్ల స్వామి వేముల సంపత్ పాతకోటి సత్తయ్య కూచన బాలకృష్ణ ఆలయ పూజారి సిద్ధార్థ శర్మ పాల్గొన్నారు

## పి.ఎన్.రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాప్య ఆశ్రమంలో అన్న వితరణ

**కీ శే తోట చంద్రయ్య గారి 11వ వర్ధంతి సందర్భంగా**






**మార్చి 22,2026,గజ్వేల్,సిద్దిపేట్ జిల్లా**

**జనసంఘర్షణ**

ఆందీపూర్ గ్రామం గజ్వేల్ మండలం మెదక్ జిల్లా నివాసి తోట వెంకటయ్య గారి తండ్రి కీ:శే: తోట చంద్రయ్య గారి 11వ వర్ధంతి సందర్భంగా పి ఎన్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తా, జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో ని బాలాజీ నగర్ మహంకాళి టెంపుల్ లైన్ లో ఏనుగుల బాల్ రెడ్డి చైర్మన్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదర్శ్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వృద్ధాప్య ఆశ్రమంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమము పి.ఎన్.రెడ్డి ఫౌండేషన్, డి ఆర్ టి వి చైర్మన్ పి నర్సింహారెడ్డి గారి ఆదేశాల అనుసారము డి ఆర్ టి వి, పి.ఎన్.రెడ్డి ఫౌండేషన్ సీఈవో మేడ మల్లేశం, బి.ఎన్.రెడ్డి ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె. సూర్యకళ, ఆదర్శ్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వృద్ధాప్య ఆశ్రమ ఇంచార్జ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## కొంపల్లిలో పిల్లల కోసం ప్రత్యేకమైన ఇండోర్ ప్లే జోన్

**అన్నం అక్షిత సారథ్యంలో గొప్ప ప్రారంభం**







**మార్చి 22,2026,కొంపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా**

**జనసంఘర్షణ**

కొంపల్లి,జీడిమెట్ల ప్రాంత వాసులకు అందుబాటులో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కొంపల్లి పరిధిలోని అపర్ణ పామ్ గ్రోవ్ వెళ్ళే దారి (గుండ్లపోచంపల్లి రోడ్) పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్ అడ్వెంచర్ ల్యాండ్ ఇండోర్ సాఫ్ట్ ప్లే ఏరియా పిల్లల కోసం గొప్పగా ప్రారంభమైయింది. ఈ ప్రారంభ మహోత్సవానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కుతుబుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి చిల్డ్రన్ అడ్వెంచర్ ల్యాండ్ ప్రారంభించారు. ఈ అడ్వెంచర్ ల్యాండ్ లో అత్యంత ప్రాచుర్యం పొందిన సాహస కేంద్రం జిప్ లైన్ (60 అడుగుల ఎత్తు )గో కార్టింగ్,అర్చరీ, పుట్టినరోజు వేడుకలకు ప్రత్యేక రూం మరియు ఇతర సాహస క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అన్నం మనోజ్ కుమార్ మంజుల,అన్నం అక్షిత, అన్నం అనురాగ్, అన్నం విదిశా, బేబీ శ్రేష్ఠ,కొంపల్లి బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరిత, బీజేపీ సీనియర్ నాయకులు శివాజీ,బీజేపీ పెద్దబుద్ధుల సతీష్ సాగర్ కొంపల్లి & దూలపల్లి డివిజన్ అధ్యక్షులు, బీజేపీ,మేడ్చల్ అర్బన్ జిల్లా వైస్ ప్రెసిసెండ్ రాజి రెడ్డి, ఉప్పరి మహేందర్,మాణిక్ రెడ్డి, దండే సూర్య, శంకర్ నాయక్,అశోక్,కుటుంబ సభ్యులు,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్,వై,ఎం,ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మార్చి 22/ఆలేరు జనసంఘర్షణ:**

సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ (సైనిక గ్రూప్) సంస్థ స్థాపించి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఆదివారం రోజున ఆలేరు పట్టణంలో రాష్ట్ర,జిల్లా కమిటీ సభ్యులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాపకులు,చైర్మన్ డాక్టర్ అరిగే లోకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ సంస్థ వాట్సాప్ మాధ్యమం ద్వారా స్టేట్,సెంట్రల్ పోలీసు ఉద్యోగాలకు చదివే నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కవాతు శిక్షణ,బుక్స్,ఆన్లైన్ క్లాసెస్ చెబుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 175 మందికి పైగా అభ్యర్థులను ఆర్మీ, పారామిలిటరీ,నేవీ,ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యేలా చేసిందన్నారు. ఇంకా మునుముందు తమ సంస్థ సేవలను నిరుపేద కుటుంబం నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిజాయితీగా సన్నద్ధమయ్యే అభ్యర్థులకు చేరువ అయ్యేలా చేస్తామని తెలిపారు.

## టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ కు సన్మానం:



**చిట్యాల మార్చి 22 జనసంఘర్షణ**

చిట్యాల పట్టణానికి చెందిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టుల బృందం ఆదివారం నలగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ల బయన్న ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ వీప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరియాల ప్రకాష్, చెరుపల్లి శ్రీనివాస్, కునూరు మధు ,ఏళ్ల వెంకన్న పాల్గొన్నారు...

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ కాటం వెంకటేశం



**చిట్యాల మార్చి 22 జనసంఘర్షణ :**

చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన తోటకూరి ఎల్లయ్య అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసిన పెద్దకాపర్తి సర్పంచ్ కాటం వెంకటేశం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . అనంతరం మృతుని కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గతంలో వీరి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, మాజీ ఉపసర్పంచ్ ఏర్పుల నరసింహ, వార్డు మెంబర్లు సాగర్ల నాగరాజు, ఆనగంటి నరేష్ ,కురు యాదయ్య, ఏర్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు..

విలేకరులు కావలేను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు అసాక్తి, ఉత్సహం కలిగిన యువతి,
యువకులు కావలేను. సీనియర్‌లకు ప్రధాన్యత ఇవ్వబడును

వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co